కట్నం పుచ్చుకోకుండా చి. సౌ. సుందరమ్మను, చి. శ్రీరామారావు వివాహమైనాడని కథ పూర్తిచేస్తూ ఆ నూతన వధూవరుల్ని దీవించడానికి సందేహం ఎందు కింక ?

... ... ... ... ...

## ఇంకెందుకు ఇల్లు?

"సెనగలు అంగడిలో అమ్ముతారు. సెనగలు పొలంలో పండుతాయి. సెనగలు నీవట్టుకొచ్చేదేమిటి? నేనే కొనుక్కొని నేనే పండించుకొని ఏ పకోడీలో, వీపాళోళీవో చేసికొని నీకు పెట్టకుండా తింటానుచూడు" అన్నాడు త్రివిక్రమరావు. అంటే అతనిభార్య విజయలక్ష్మి "నేను తెచ్చే సెనగలకు మీరు తెచ్చే సెనగలకు సహస్రంవారుంటుంది. వెళ్లి తెచ్చేబుద్ధి పుట్టాలినాకు. ఎంచేతో ఈ యేడు పేరంటానికి వెళ్ళడమంటే బుద్ధిపుట్టడంలేదు. మీరు వండబొయ్యే పిండివంటతిని యింట్లోనే కూర్చుందామని వుంది" అంది.

అపొద్దు శ్రావణమంగళవారం. అంతకుపూర్వం ఎంతసేపట్నుంచి భార్యాభర్తలిరువురూ అలా తర్కించుకుంటూ కాలం వెళ్ళబుచ్చేరో ఎవరికీ తెలియదు. అప్పుడే తపాలబంట్రోతు "ఉత్తరాలొచ్చాయండో" అని తలుపుసందంట పడేసి వెళ్ళిపోయినాడు. ఆ యుత్తరాలు మూడో నాల్గో విజయలక్ష్మి తీసి తిన్నగాతెచ్చి త్రివిక్రమరావుచేత పెడుతూ "దీనికి బిళ్ళలేదేమిటండి?" అని అడిగింది. 'దేనికి?' అని త్రివిక్రమరావు "తపాలా బంట్రోతు ఉత్తరాలు తీసికొని వచ్చినాడూ అంటే 2 ఘంటలపరాహ్నం తిరిగిందన్నమాటే. కాఫీకి 'స్టవ్' అంటించావుకావింకా?" అని "దీనికా?" అని అమూడు నాలుగుత్తరాల్లోనూ ఒక కవరుతీసి ఇటూ అటూ చూచి "బిళ్లలేక పోవడమే కాకుండా

అసలంటించిగూడలేదు. బహుశా ఊళ్లోవాళ్ళెవళ్లో టీకి పిల్చి వుంటారు" అన్నాడు. "మిమ్మల్నీ నన్నూగూడానా? మిమ్మ ల్నేనా?" అంది విజయలక్ష్మి. "నన్నొక్కణ్ణే అయ్యుంటుంది. నిన్ను పిల్చేవాళ్ళంతా నన్ను పిలుస్తున్నారా? నిన్న మధ్యాహ్నం నుంచి చూస్తా గుమ్మం ఎక్కపడుచు దిగేపడుచు నీకు బొట్టెట్టి సెనగలకు రమ్మనడమేగాని నన్ను పిలవడంవుందా? అలాగే నన్ను పిల్చేస్నేహితులున్నూ" అన్నాడు త్రివిక్రమరావు. ఇంతకూ అది పిలుపవునో కాదో చూడండి. వట్టినాట కప్పేపరేమో? అప్పుడే అనేసెయ్యకండి. ఆఁ ఏమి ఆ కులుకు? అంది విజయ లక్ష్మి. త్రివిక్రమరావు మందహాసంతో "నేనన్నాక 'టీ'కి కాక మరో అందుకు అవుతుందా అది?" అన్నాడు. "అయితే 'స్టవ్' వెలిగించనక్కరలేదు. నేను పేరంటానికి వెళ్ళిపోవచ్చుననన్న మాటే" అంది విజయలక్ష్మి. "అయితే యింటికి తాళం నువ్వేసుకొనివెళ్ళి నాకు తాళంచెవి యివ్వడమా? లేక తాళం నేనేసుకొనివెళ్ళి నీకు చెవియివ్వడమా? యోజించు" అన్నాడు త్రివిక్రమరావు. "ఎవరి ముస్తాబు ముందైతే వారు వెళ్లిపోవడం. రెండోవారు తాళంవేసికొని తాళాలుకూడా పట్టుకుపోవడం. తాళాలు పట్టుకుపోయినవాళ్ళు తిరిగి వచ్చేదాకా తాళాలు పట్టుకెళ్ళనివాళ్ళు కనిపెట్టుకూర్చోవడం" అంది విజయలక్ష్మి.

"మొగాణ్ని నాకు ముస్తాబేమిటి" అని త్రివిక్రమరావు చెవులపొట్టిమెడ చొక్కా తొడుక్కుని దానిమీదో కండువా వేసి కొని కాళ్ళకో అకుచెప్పుల్జోడు తగిలించుకొని చేతబెత్తం మూల నున్నదానట్టే అందుకొని రంయిని వెళ్ళిపోయినాడు తనకొచ్చిన తక్కిన వుత్తరాలు చూచుకుంటూ చేతులూచుకుంటూ—విజయ లక్ష్మి ఆవెడుతూవున్న భర్తకేసిచూస్తూ "మొగవాళ్ళెంతకైనా స్వేచ్ఛావిహారులు. పక్షులల్లే ఒక్క నిముషంలో ఎగిరిపోగలర్కు. ఆడవాళ్ళు కబుర్లేగాని కాళ్ళగొలుసులు, చేతుల వంకీలు తిప్పుకుంటేనేగాని సరుదుకుంటేనేగని కదల్లేరు" అంటూ తలుపు

లోపల గెడపెట్టుకుని గదిలో పెట్లో చీర తీసికోబోతూంది. చటుక్కున వీధితలుపెవరో గాజులమ్రోతతో తట్టినట్లయింది. "ఎవరమ్మా?" అంది విజయలక్ష్మి. "నేనూ" అంటూ దీర్ఘం తీసింది అవతల ఎవరో. విజయక్ష్మి సరభసంగా వీధితలుపుతీసి "ఓసి! గోపీ! నువ్వుటే? ఎవరో అనుకున్నాను. శ్రావణమాసం సెనగలకు పిలవడానికేనా వచ్చేవు? వస్తున్నా నీవెనకాలే వస్తున్నా" అంది.

విజయలక్ష్మి హడావిడిచూచి గోపి మారేంమాటాడలే. ఆవిడంత హడావిడిగా వస్తున్నాననకపోతే అనుండేది. "నిన్న రాలేక పోయాను. అన్నిళ్ళూపిల్చుకుని దగ్గరిల్లుకదా మీయిల్లు ఎప్పుడు పిల్చినా పిలవొచ్చునను కోవడంలో రాత్రి ఎనిమిది తొమ్మిదై పోయింది—" అని ఏమేమో గోపి అనుండేది. కాని విజయలక్ష్మి హడావిడిచూచి గోపి మరేంమాటాడలే వెళ్లిపోయింది.

గోపి మరేం మాటాడకపోయినా గోపిని గురించి ఓమాట మనం అనుకోవలసింది. 'గోపి' అని ఆ అమ్మాయి నెవరినో విజయలక్ష్మి పిలిచిందికదా అని మనం అంతా "గోపీ" అని పిలువకూడదు. ఈపైని చదువకూడదు. ఆ అమ్మాయిపేరు గోపెమ్మ. పదారేళ్లుంటాయి. కాని ఆ అమ్మాయికి తల్లిదండ్రులు శారదా శాసనాన్ని అనుసరించి పెళ్లిచేయడంవల్ల ఆయేడే కొత్తగా శ్రావణమంగళవారాల్నోము పట్టింది. పిలుస్తూందందర్నీ పేరంటానికని—ఎవరూ ఏమీ ఆశ్చర్యపోవడానికేముంది అందులో. ఆపిల్ల అందరిలాగే పిలుచుకుకి వెళ్ళింది ఇంటింటా. కాని ఇంటింటా అమ్మలక్కలు మాత్రం గుసగుస లాడుకోవడం మానలే. "శారదా శాసనంక్రింద పెళ్ళిచేసికొన్నా సెనగలవాయనం శ్రావణశుక్రవారాల్నోములూ ఎప్పట్లాగే చేసికోవచ్చును. వాటికి నిషేధంలేదుగా" అని ఒక ముత్తయిదు అంటే "శారదాశాసనం క్రింద పెళ్లిచేసుకుంటే బిడ్డలుట్టరా? వాళ్లకు సంసారంవుండదా" అని మరో ముత్తయిదు—

విజయలక్ష్మికి పైమాదిరిగా వితర్కింపులో పడ్డానికి అవకాశం లేకపోయింది. పిల్చింది తడవుగా పేరంటానికి వెళ్ళి పోవడానికి కాలం కటాకటీగావుందీ. గబుక్కున ముస్తాబు అయి తలుపు తాళంవేసికొని తాళంచెవి చెంగునే కట్టుకొని ఝంగురంగా మని రాజమార్గాన్నే పేరంటానికి బయలుదేరుతూ “ ఆలస్యంగా పిల్చినవాళ్ళింటికి ఆలస్యంగానే వెళ్ళాలా ? ఆలస్యంగా పిల్చినా దగ్గరిల్లు అని ముందుగా వెళ్ళాలా ? ” అని ఒక చూపుమాత్రంగా ఆలోచించి తన భర్త త్రివిక్రమరావు వెళ్ళిన దిక్కు అదే, అటే గోపమ్మగారి యిల్లూను. పోనీ గోపమ్మగారి యింటికే వెళదాము అని చెప్పశక్యముగాని ఒకానొక తాత్కాలిక కారణం ప్రేరేచగా విజయలక్ష్మి తుట్టతుద కేలా అయితేం గోపెమ్మగారింటికే మొట్ట మొదట పేరంటం చెయ్యడానికి నిశ్చయించుకుంది. నిశ్చయించు కొని గోపెమ్మగారింటికి వెళ్ళింది.

లోపలిచావడిలో చాపలు పరిచినారు. ఆ చాపలమీద వచ్చే పేరంటాండ్రను కూర్చోబెట్టి గోపెమ్మతల్లి సెనగలు ఇస్తూ పంపి స్తూంది. ఆ చావడి కోప్రక్కగా ఒకగది వుంది. ఆ గదిలో మగవాళ్లు ఇష్టాగోష్టిగా కాలక్షేపం చేస్తూవున్నట్టు సూచనగా చావడిలోనికి వినబడుతుందేగాని కనబడదు. ఏమా అంటే గది తలుపులు ఈవలమూసి గది ఆవలిగుమ్మం వీధి చావడిలోనికి ఆదినే ఓరగాతెఱచి వుంచినారు. వీధంటవచ్చే ఆడవాళ్ళు లోపలి మగవాళ్ళకు కనబడేట్టు, లోపలిమగవాళ్ళు మాత్రం ఎవరికీ కనబడనట్లు—

విజయలక్ష్మి కాసేపు కూర్చోవడంలో గదిలో మగవాళ్ళ ఇష్టాగోష్టినడుమ తన భర్త కిచకిచమని నవ్వుతూండడం వింది. “ ఎవరైనా ఉన్నారా ఏమిటి అక్కడ? ” అని అంది విజయ లక్ష్మి గోపెమ్మను కొంచెం దగ్గరగాపిలిచి. గోపెమ్మ “ మీ ఆయనా మా ఆయనా అంతే ఇంకెవరూ కారు ” అంది. “ అయితే త్వరగా పోవాలనూ గోపెమ్మ ! ” అంది విజయలక్ష్మి.

ఆమాట వింటూ "ఇంటితాళం ఇలా యిచ్చి మరీవెళ్ళు. ఎన్ని ఇళ్ళు నీవు తిరిగిరావాలో ఇంకా?" అన్నాడు త్రివిక్రమరావు. "ఎక్కడికో 'టీ'కి వెడతానన్నారుగా!" అంది విజయలక్ష్మి. ఇక్కడికే అని తలుపు బార్లా తీసివేసినాడు త్రివిక్రమరావు.

గదిలో మేజాబల్ల, మేజాబల్లమీద తెల్లనిగుడ్డ, తెల్లనిగుడ్డ మీద పళ్ళాలు కూజాలు గిన్నెలు గరిటెలు వాటిల్లో పళ్లు, రొట్టెలు, పకోడీలు, తియ్యబూంది, కారాబూంది ఒకటేమిటి అన్నీవున్నాయి.

త్రివిక్రమరావు అడిగేడు విజయలక్ష్మిని వెంటనే "చూడు మగవాళ్ళకు శ్రావణమంగళవారపు వాయనం ఎలావుందో?" అని ఒక పకోడీ తన నోట్లో వేసికొన్నాడు. గోపెమ్మ "అలాంటప్పుడు చూడకూడదు. నీవుకూడ కూర్చునితినాలిసిందే. చూడు నేనెలాకూర్చుని తింటానో" అని తన భర్త దగ్గరసగా కూర్చుంటూ విజయలక్ష్మిని లాగింది.

విజయలక్ష్మి జంకక కూర్చుంటూ "నన్నుకూడా తేనీటికే పిలువక సెనగలవాయినానికని ఎందుకు పిల్చేవు?" అంది. "ఆ పిలుపు మా ఆయంది. ఈ పిలుపు నాది" అంది గోపెమ్మ. అలా అనకు అంది విజయలక్ష్మి. "నాది శ్రావణమంగళవారప్పిలుపు. మీ ఆయింది సంఘసంస్కరణ పిలుపు అని అను" అంది. త్రివిక్రమరావు అన్నాడు "రెండూ మిళితమై యున్నాయి ఈ పకోడీల్లో. ఏమమ్మా! గోపమ్మా! ఆ నానబోసిన సెనగలు రుబ్బి చేసినావే ఈ పకోడీలు" గోపెమ్మ "ఏమో చిన్నపిల్లను నాకవన్నీ తెలియవు తినడమేగాని" అంది, అని ఒక పకోడి తన నోటిలో వేసికొంది. గోపెమ్మ పెనిమిటి "తెలియదనకు మరి. పంద్రెం డేళ్ళప్పటి పెళ్ళిపడుచులు వాయనమిస్తే సెనగలువాయనమియ్యాలి. పదారేళ్లప్పుడు పెళ్లి అయియుంటే టీపార్టీ చెయ్యాలి అని అనలేదే నిన్నను నీవు?" అని అంటూ గిన్నెలోనికి తేనీటి

కషాయం పోసినాడు గోపెమ్మ చాలుచాలనేలాగు. చావడిలో నుంచి సర్వసామాన్యపు పేరంటాండ్రంతా గోపెమ్మతల్లి వాయనా లిస్తుంటే పుచ్చుకుంటూ ఊతొంగిచూడ్డం, విజయలక్ష్మమ్మ కూడా వాళ్లల్లో కలిసిపోయిందనుకోవడం, విజయలక్ష్మి త్రివిక్రమ రావుకేసిచూస్తూ తన చెంగుతాళంచెవి కావలిసొస్తే విప్పుకోమనడం.

త్రివిక్రమరావు "ఇంటికిరావు నీవు?" అన్నాడు. భార్య కేసిచూస్తూ. విజయలక్ష్మి "ఇంకెందుకు ఇల్లు? సెనగలు నేనింటికి పట్టుకునివెళ్లి వేయించనక్కరలేదు. రుబ్బనక్కరలేదు. మీకు పెట్టనక్కరలేదు. నే తినక్కరలేదు, ఇంకెందుకు ఇల్లు?" అంది. పకపకా నవ్వుకున్నారు అంతా.

... ... ... ... ...

## ముగురప్పా సెల్లెండ్రలోనూ తెలివిమంతురాలు ఎవతె?

రామవర్మ కూతుళ్లు ముగ్గురు. వరుసగా పెద్దమ్మాయి, చిన్నమ్మాయి, చిట్టమ్మాయి అని పిలవడమేకాని పేర్లుపెట్టి పిలవక పోవడంచేత చాలా కాలంవరకూ వాళ్ల పేర్లెవరికీ తెలియవు. పెద్దదిగి వారివారి మగలతో కాపరాలుచేస్తూ వచ్చిందాకా ఎవరికీ తోచలే "పేర్లుపెట్టి పిలవాలి ఆడపిల్లల్ని పెద్దమ్మాయి, చిన్నమ్మాయి, చిట్టమ్మాయి అని పిలవకూడదు. పిలిచినా వాళ్లు పలకరు" అని.

అదెట్లా సంభవించిందంటే పెద్దమ్మాయిని రామవర్మా వాళ్ళూ పెద్దమ్మాయి యని పిలుస్తూంటే పెద్దామ్మాయి మగడో నాడు పెద్దమ్మాయి యేమిటి పెద్దమ్మా దద్దమ్మా" అని కినిసేడు. అదిచూచి చిట్టామ్మాయి మగడు "చిట్టి పొట్టి తవుడు దూగర ... ?" అన్నాడు. చిన్నమ్మాయి మగడు చిరునవ్వు